సాక్షి
నల్లగొండ
గురువారం । 19 । డిసెంబర్ । 2024



వైభవంగా ధనుర్మాసోత్సవాలు
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగాయి. - 8లో



శిల్ప సంపదను కాపాడుకోవాలి
పురాతన శిల్ప సంపదను కాపాడుకోవాలని ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. - 8లో



అనుమతులు రద్దుచేయాలి
రావిపహాడ్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

సైన్స్ ఎగ్జిబిషన్ వాయిదా

నల్లగొండ : ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న సైన్స్ ఎగ్జిబిషన్ తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఇతర ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యే అవకాశం లేనందున సైన్స్ ఎగ్జిబిషన్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఈఓ బి.భిక్షపతి తెలిపారు. తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ విషయం గమనించాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ

చింతపల్లి : ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఇష్టపడి చదవాలని డీఐఈఓ దస్రూనాయక్ సూచించారు. బుధవారం చింతపల్లిలోని జయేందర్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలన్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవాలన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ దస్‌రాజ్, అధ్యాపకులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

నల్లగొండ : మినిస్టీరియల్ ముసఫిల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం టీఎన్‌జీఓ భవన్‌లో ఎన్నుకున్నారు. జిలా అధ్యక్షుడిగా నామా రామసురేంద్రనాథ్, కార్యదర్శిగా శ్యాంసుందర్, కోశాధికారిగా రుద్రాక్షి భిక్షంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ నాయకులు ఎస్.మురళి, జె.శేఖర్‌రెడ్డి, డి.వి.రాజు, సీహెచ్.నర్సింహాచారి, విజయకృష్ణ, బి.రణదేవ్ పాల్గొన్నారు.

చెర్వుగట్టులో తలనీలాల సేకరణకు వేలం



వేలం పాటు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని గట్టు పైన భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు బుధవారం హైదరాబాద్‌లో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో గుంటూరు జిల్లా కొలకలూరు చెందిన వ్యక్తి రూ.1,39,00,000 దక్కించుకున్నారు. సదరు వ్యక్తి ఏడాదిపాటు దేవాలయం ఆవరణలో తలనీలాల సేకరించుకునే హక్కు కలిగి ఉంటారని దేవాలయ ఈఓ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సురకంటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. దేవాలయ నిబంధనల ప్రకారం డబ్బు చెల్లించని పక్షంలో టెండర్ రద్దు చేస్తారని పేర్కొన్నారు.

నేడు అసెంబ్లీ ముట్టడి

నల్లగొండ: చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు కోరారు. మాలమహానాడు జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై నిరసన వ్యక్తం చేస్తూ గురువారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అన్ని మల్ల లింగస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు అంగరాజు స్వర్ణలత, భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు కూచమల్ల లలిత, జ్యోత్స్న, దామల్ల విజయ, రొయ్య కిరణ్, ముదుసు భిక్షం, ముసుకు పృథ్వీ, అద్దంకి వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుబాబు

జాగ్రత్తలతోనే.. చలినుంచి రక్షణ



అధిక చలికి జాగ్రత్తలు ఇవీ..

• జనరల్ ఫిజీషియన్, డాక్టర్ మాతృ సూచన

నల్లగొండ : చలి తీవ్రత బాగా పెరిగింది. ఈ చలిలో చిన్న పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ చలికి వైరల్ ఫీవర్లు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. తగు జాగ్రత్తలు తీసుకుని చలి నుంచి రక్షణ పొందాలని సూచిస్తున్నారు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మాతృ.

- చలి తీవ్రత పెరిగితే చిన్న పిల్లల్లో నిమోనియా వచ్చే అవకాశం ఉంది. నిమోనియా వస్తే అస్తమాతోపాటు వైరల్ ఫీవర్ కూడా వస్తుంది. చిన్న పిల్లలను ఎప్పుడూ వెచ్చగా ఉంచాలి. చేతులు, కాళ్లు, తలకు ఉన్ని దుస్తులు వేయాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్న పిల్లలను బయటకు తీసుకురావద్దు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే అన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.
- వృద్ధులు, గుండె జబ్బులున్న వారు, అస్తమా రోగులు, టీబీ పేషెంట్లు, షుగర్ ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. చలికి రక్తం చిక్కబడే ప్రమాదం ఉంటుంది. అస్తమా రోగులు జాగ్రత్తలు తీసుకోకపోతే మరణించే అవకాశం కూడా ఉంటుంది. ఊపిరితిత్తుల్లో శ్వాస నాళాలు మూసుకుపోయి శ్వాస సక్రమంగా తీసుకోలేరు. ఒకవేళ అలాంటి ఇబ్బంది ఉంటే వెంటనే ఆస్పత్రి వెళ్లాలి. టీబీ, షుగర్ వ్యాధిగ్రస్తులు సాయంత్రం చలి ప్రారంభం కాకముందే ఇళ్లు చేరడం మంచిది.
- చలికాలం ఎక్కువగా దాహం వేయదు కాబట్టి నీరు తాగరు. మూత్రం అధికంగా వస్తుందని కూడా నీరు తాగరు. అది మంచిది కాదు. నీరు సరిపడా తాగాలి. ప్రధానంగా మాంసాహారానికి దూరంగా ఉండాలి.



డాక్టర్ మాతృ, జనరల్ ఫిజీషియన్

వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి

• న్యూట్రిషియనిస్ట్ డాక్టర్ కళ్యాణి సూచన



నల్లగొండ : చలి తీవ్రత పెరిగింది. వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆహార విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.. న్యూట్రిషియనిస్ట్ డాక్టర్ కళ్యాణి.

- ఈ కాలంలో వేడిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఫ్రిడ్జ్‌లోని ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దు. బేకరి ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి.
- చలి కాలమని పండ్లు తినడం మానేస్తారు. అది సరైంది కాదు. పండ్లు తినాలి. వాటితో పాటు ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాలు, పెరుగుతోపాటు గుడ్డు తీసుకుంటే మంచిది.
- రోజువారీ డైట్‌లో రోగనిరోధక శక్తి పెంచే ఆహార పదార్థాలను చేర్చాలి. క్యాబేజీ, నిమ్మజాతి పండ్లు, చిలగడదుంపతో పాటు తృణధాన్యాలు తీసుకోవాలి. రోజూ ఉదయాన్నే వేడివేడిగా ఓ కప్పు గ్రీన్‌టీ లేదా అల్లంటీ తాగాలి.
- ముఖ్యంగా తాజా కూరగాయలు, మొలకెత్తిన గింజలు, బీన్స్, మాంసం వంటి పదార్థాలతో తయారు చేసిన సూప్స్ వేడివేడిగా తీసుకోవాలి. తద్వారా ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



డాక్టర్ కళ్యాణి, న్యూట్రిషియనిస్ట్

మారని మిల్లర్ల తీరు

ధర తగ్గించి ధాన్యం కొనుగోలు



మిర్యాలగూడలోని మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

- కోతలు ప్రారంభంలో క్వింటాకు రూ.2800 వరకు చెల్లింపు
- ఇప్పుడు రూ.2100 నుంచి రూ.2200 వరకే..
- పెట్టుబడి కూడా వెళ్లదని రైతుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, మిర్యాలగూడ : వానాకాలం వరి కోతలు పూర్తికావొచ్చినా మిల్లర్ల తీరు మారడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు.. మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ధర విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2320 కూడా ఇవ్వడం లేదు. కోతలు ప్రారంభమైన సమయంలో ధాన్యం క్వింటా రూ.2700 నుంచి రూ.2800 పలకగా.. కోతలు ముమ్మరంగా సాగిన సమయంలో రూ.2500 నుంచి రూ.2400 వరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.2100 నుంచి రూ.2200 వరకే చెల్లిస్తున్నారు. దీంతో పెట్టి పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలోకి కూరుకుపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సన్నాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది తక్కువే..

జిల్లాలో సన్న ధాన్యాన్ని ఇప్పటివరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో చాలా తక్కువగా కొనుగోలు చేశారు. తేమ 17 శాతానికి మించి ఉంటే కేంద్రాల్లో కొనడం లేదు. దీంతో రైతులు పది నుంచి 15 రోజుల పాటు కల్లాల్లో ధాన్యం ఆరబోసుకొని వేచి ఉండాల్సి వస్తోంది. నిర్దేశిత తేమ శాతం వచ్చే వరకు ధాన్యాన్ని కాపాడుకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు వేచి ఉండలేక కోసిన ధాన్యాన్ని 25 శాతం వరకు తేమ ఉన్నా మిల్లుల్లో అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం ధాన్యం 1,90,980 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేస్తే, సన్న ధాన్యం 37,435 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. మిగతాదంతా మిల్లులకే వెళ్తోంది.

తప్పిన అంచనా..

జిల్లాలో ఈ వానాకాలంలో జిల్లాలో 12 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని.. అందులో సన్న రకం 2.80 లక్షల టన్నులు, సాధారణ (దొడ్డు) రకం 4.70 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని లెక్కలు వేశారు. మిగతా 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో కొంతమేర రైతులు తమ అవసరాల కోసం నిల్వ చేసుకోగా.. మిగతా ధాన్యం పూర్తిగా మిల్లుల ద్వారానే విక్రయిస్తారని వ్యవసాయ శాఖ పేర్కొంది. కానీ ఈ అంచనాలు తప్పాయి.

అదును చూసి ధర తగ్గింపు

ఆయకట్టు పరిధిలో ప్రధానంగా చింట్లు, హెచ్ఎంటీ, మహేంద్ర చింటు రకాల సన్న ధాన్యాన్ని రైతులు పండించారు. మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో నెల రోజుల కిందటి నుంచి రైతులు తమ పొలాల్లో కోసిన ధాన్యాన్ని మిల్లుల వద్దకు తీసుకొస్తున్నారు. రైతుల రాక పెరగడంతో ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ధాన్యం ధరలు తగ్గించారు. దీంతో రైతులు చేసేదేమీ లేక, మరో రోజు వేచి ఉండాలంటే ట్రాక్టర్ కిరాయి భారం పడుతుందనే భయంతో వ్యాపారులు అడిగిన రేటుకు ధాన్యం ఇచ్చి వెళ్తున్నారు.

దిగుబడి తగ్గింది



నీటి ఎద్దడి కారణంతో బోర్ల కింద వానాకాలంలో నాలుగు ఎకరాలు సాగు చేశా. ఎకరాకు 30 బస్తాలే దిగుబడి వచ్చింది. ధాన్యం రైస్ మిల్లుకు తీసుకెళ్లగా క్వింటాకు రూ.2,200 చొప్పున కొనుగోలు చేశారు. ఆర్థికంగా బాగా నష్టపోయా.
– భూక్య చక్రు, తిమ్మాపురం

సాగు చేసినా ఫలితం లేదు



మూడెకరాల్లో వరిసాగు చేపట్టా. 90 బస్తాల దిగుబడి వచ్చింది. తీరా అమ్ముకుందామని మిల్లులకు వెళ్తే క్వింటాకు రూ.2300 ధర చెల్లించారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యానికి ధర తగ్గించారు. శ్రమించి సాగు చేసినా ఫలితం లేకుండా పోయింది. పెట్టిన పెట్టుబడి సైతం ఎల్లక ఆర్థికంగా దెబ్బతిన్నా.
– కోట లక్ష్మయ్య, కల్లేపల్లి

మాతా శిశు మరణాలు సంభవించొద్దు

• కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : మాత శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మహిళ గర్భం దాల్చిననాటి నుంచి ప్రసవం అయ్యే వరకు, ప్రసవానంతరం కూడా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతినెలా వైద్య పరీక్షలు, ఇమ్యునైజేషన్, పౌష్టికాహారం అందించాలని సూచించారు. వైద్యుల అనుమతి లేకుండా మెడికల్ షాపులు, ఆస్పత్రుల్లో అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమన్నారు. మాత శిశు సంరక్షణపై మూడు డివిజన్లలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణవేణి, అరుణకుమారి వైద్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టాం



చెక్ పోస్టును పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

హాలియా, నాగార్జునసాగర్ : ఇతర రాష్ట్రాల నుంచి సన్నధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని చెక్‌పోస్టును, అనుముల మండలంలోని హాలియా, కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్నధాన్యం రాకుండా బార్డర్ చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 34,879 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 1,91,858 టన్నుల దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారికి రూ.433 కోట్లు చెల్లించామన్నారు. అదే విధంగా 8,450 మంది రైతుల నుంచి 40,150 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారికి రూ.14.50 కోట్లు బోనస్ రూపంలో క్వింటాకు రూ.500 చెల్లించినట్లు తెలిపారు. ఆయన వెంట పెద్దవూర డీటీ సీఎస్ ముక్తార్, కొత్తపల్లి సొసైటీ సీఈఓ సత్యం ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఈ నెల 30న జరగనున్న సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మగ్దూమ్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని ధ్వంసం చేయడం కోసమే ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చిందన్నారు. సీపీఐ జమిలి ఎన్నిక బిల్లును వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ 100 సంవత్సరాల బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే సీపీఐ బహిరంగ సభకు పార్టీ శ్రేణులతోపాటు కమ్యూనిస్టు అభిమానులు నూతన ఉత్తేజంతో తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, లోడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, ఆర్.అంజచారి, బంటు వెంకటేశ్వర్లు, బొల్లూరి నర్సింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, గాదెపాక రమేష్, కె ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ అటాచ్‌లో ఉన్న 11 మందికి పోస్టింగ్

నల్లగొండ క్రైం : ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌లో ఉండి వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 11 మంది సిబ్బందికి బుధవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోస్టింగ్ ఇచ్చారు. ఈ 11 మంది ట్రాఫిక్‌లో విధులు నిర్వహించకుండా వివిధ పోలీస్‌స్టేషన్లలో, జిల్లా పోలీస్ కార్యాలయంలో, డివిజన్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ 30 శాతం అదనంగా అలవెన్స్ పొందుతున్నారు. సివిల్ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ అలవెన్స్ తీసుకుంటున్న విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆయన వారిని ఇతర విభాగాల్లో పోస్టింగ్ ఇచ్చారు. 19 మంది సిబ్బందికి ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించేందుకు పోస్టింగ్ ఇచ్చారు.

డిప్యుటేషన్ పేరిట పాతుకుపోయిన సిబ్బంది!

పోస్టింగ్ ఒక చోట ఉండి.. విధులను జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్లలో నిర్వహిస్తున్న విషయమై కూడా చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖలో చర్చ సాగుతోంది. అలా పని చేస్తున్నవారు డిప్యుటేషన్ పేరిట ఆయా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ ఎస్ఐలు, సీఐలను ప్రసన్నం చేసుకుంటూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్న చర్చ ఉంది. వీరు లేకపోతే పోలీస్‌స్టేషన్ నిర్వహణ చేయలేమని.. ఎస్ఐలు, సీఐలు డిప్యుటేషన్ పేరిట వీరిని కొనసాగించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తుండడంతో స్టేషన్లలో వారి ఇష్టారాజ్యం సాగుతోందని చర్చ సాగుతోంది.

డీఐఈఎల్ఈడీ పరీక్షకు 39 మంది హాజరు

నల్లగొండ : నల్లగొండలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన డీఐఈఎల్ఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పేపర్–1 పరీక్షకు 39 మంది హాజరైనట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. మొత్తం 41 మందికి గాను 39 మంది పరీక్ష రాయగా, ఇద్దరు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

హోరాహోరీగా సీఎం కప్ క్రీడాపోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ –2024 జిల్లాస్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం మూడవ రోజు ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలను పరిశ్రమల శాఖ జీఎం కోటేశ్వర్‌రావు, డీఈఓ భిక్షపతి, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎం వీ.గోనారెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలు నువ్వా.. నేనా అన్న రీతిలో సాగాయి. గెలుపొందిన జట్లకు నిర్వాహకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ (అండర్-19) కార్యదర్శి ఇందిర, విమల, కిరణ్, నజీర్, సురేష్, బొమ్మపాల గిరిబాబు, ఇమామ్ కరీం, కవిత, నాగరాజు, బాలు, యుగంధర్, నారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'ఇందిరమ్మ' సర్వే

- రోజుకు 50 మంది దరఖాస్తుదారుల ఇళ్లను సర్వే చేయాలని ఆదేశాలు
- కానీ 10 నుంచి 20 ఇళ్లు కూడా చేయలేకపోతున్న సిబ్బంది
- సర్వర్ సమస్యతో ముందుకుసాగని సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. సర్వర్ సక్రమంగా పని చేయకపోవడం వల్ల సర్వే కోసం వెళ్లిన సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్‌కాక గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. రోజుకు 50 ఇళ్లను సర్వే చేయాలని అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో అది సాధ్యం కాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

4,31,831 మంది దరఖాస్తు..

ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో 4,31,831 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లాలో ఇందిరమ్మ సర్వేను ప్రారంభించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో సర్వే సాగుతోంది. ప్రతి ఒక్కరూ రోజూ 50 మంది దరఖాస్తుదారుల ఇళ్లను సర్వే చేయాలని ఆదేశించింది. దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వాటి ఆధారంగా సర్వే చేస్తున్నారు. అయితే సర్వేకు వెళ్లిన సందర్భంలో సర్వర్ పనిచేయక పోవడంతో రోజూ ఐదు ఇళ్లను కూడా సర్వే చేయలేకపోతున్నారు. దీంతో ఇప్పటి వరకు 67 వేల ఇళ్లను మాత్రమే సర్వే చేశారు.

సర్వేకు ఎక్కువ సమయం

దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లిన సమయంలో.. ఉండే ఇల్లు ఒక చోట ఉంటే కొంతమంది ప్లాటు వేరే చోట ఉంటున్నాయి. దరఖాస్తుదారుడి ఫొటో, డాక్యుమెంట్‌తో పాటు ప్లాట్ ఫొటో కూడా తీసుకోవాల్సి ఉండడంతో సమయం ఎక్కువ పడుతోంది. మొన్నటి వరకు ఇంటి డాక్యుమెంట్ లేదా ఇంటి పన్ను రసీదును కూడా పీడీఎఫ్ చేసి ఆన్‌లైన్‌లో పెట్టాలని నిబంధన ఉన్నా.. ప్రస్తుతం అది అవసరం లేదని ఫొటో మాత్రమే తీయాలని పేర్కొన్నారు. సర్వర్ సతాయింపు, గ్రామాల్లో నెట్ సక్రమంగా అందకపోవడంతో కొంత సమస్యగా మారింది. ప్రతి రోజు 10 నుంచి 20 ఇళ్ల వరకు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో సిబ్బంది ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చింతపల్లి ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు

చింతపల్లి : ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించడం, కిందిస్థాయి సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన కల్పించకపోవడంతో చింతపల్లి ఎంపీడీఓ సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె చింతపల్లి మండలం ఘాసిరాం తండా, నసర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఘాసిరాంతండాలో సర్వే బృందం యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. రమావత్ శంకర్, కొర్ర సరిత వివరాలను సరిగా అప్‌లోడ్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుల పరిశీలనకు సర్వే బృందాలు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు ఇంటి వద్ద ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 18004251442 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


నాగరాజు (ఫైల్)

త్రిపురారం: ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుతాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామ పంచాయతీ పరి ధిలో బుధవారం జరిగింది. ఎస్ఐ వై. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాగరాజు బుధవారం అల్వాలపాడులో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో అల్వాలపాడు గ్రామానికి చెందిన తన బంధువు సైదులు పొలం వద్ద వ్యవసాయ మోటారు పనిచేయకపోవడంతో దానిని సరిచేసేందుకు సైదులు, నాగరాజు కలసి పొలం వ ద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నాగరాజు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేయడానికి వెళ్లాడు. అక్కడ ఒకే దిమ్మెపై రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. ఒక ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేస్తుండగా పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ వైరు నాగరాజు చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కాగా కుడి చేయి, రెండు కాళ్లు కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి బుర్రి సాంబమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ దగ్ధం

చిట్యాల: వ్యవసాయ బావి వద్ద ఉంచిన ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ ఘటన చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. ఎలికట్టె గ్రామానికి చెందిన శివగోని భరతయ్య మంగళవారం సాయంత్రం వరకు ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేశాడు. పనులు పూర్తయిన తర్వాత ట్రాక్టర్‌ను పొలం వద్దే నిలిపి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం తిరిగి పొలం వద్దకు వెళ్లేసరికి ట్రాక్టర్ ఇంజన్ నుంచి మంటలు రావడం గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. ట్రాక్టర్ ఇంజన్‌కు అంటుకున్న మంటలను నీటితో ఆర్పివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

భువనగిరిటౌన్: ఆవులను కబేళాకు తరలిస్తున్న వాహనాన్ని బుధవారం హిందూ వాహిని సభ్యులు అడ్డుకొని భువనగిరి పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రెండు బొలేరో వాహనాలు, ఒక డీసీఎంలో 36 ఆవులను విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా భువనగిరి పట్టణ శివారులో నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద హిందూ వాహిని సభ్యులు అడ్డుకున్నారు. బహదూర్‌పురకు చెందిన జాఫర్ 36 ఆవులను, లేగ దూడలను కొనుగోలు చేసి కబేళాకు తరలిస్తున్నట్లు చెప్పారు. వాహనాల డ్రైవర్లు నాగేశ్వర్‌రావు, గన్ని వంశీకృష్ణ, బత్తుల గోపి, వాకాల స్వామితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి గోవులను జియాగూడా గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు పక్కన జాతీయ జెండా తోరణం


రామాపురం క్రాస్‌రోడ్ సమీపంలో పడేసిన జాతీయ జెండా తోరణం

కోదాడరూరల్: మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ సమీపంలో రోడ్డు పక్కన జాతీయ జెండా తోరణాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పడేశారు. జాతీయ జెండాకు కనీస గౌరవం ఇవ్వకుండా రోడ్డు వెంట పడేయడమేంటని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పడేశారని తమకేం సంబంధం లేదని అన్నారని స్థానికులు తెలిపారు.

నారు మడిలో రోజూ నీటిని మార్చాలి



- కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచన

అధిక చలికి జాగ్రత్తలు ఇవి..

త్రిపురారం: శీతాకాలంలో పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంటల రక్షణకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచనలు..

- జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత అధికంగా ఉండడంతో వరి నారు మడిలో రోజూ నీటిని మార్చుతూ ఉండాలి.
- వీలైతే రాత్రి సమయంలో నారుపై టార్పాలిన్ పట్టాలు కప్పి ఉదయం తీసివేయాలి.
- కొత్తగా నారు మడులు సిద్ధం చేసుకునే రైతులు పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల ఎరువులను దమ్ములో కలిపి దున్నుకోవాలి.
- దీంతో నారు మడి వేడిగా ఉండి చలికి తట్టుకుంటుంది.
- చలికి బత్తాయి, నిమ్మ, నారింజ, మామిడి పంటల్లో పూత, పిందె రాలకుండా శాస్త్రవేత్తల సూచనల మేరకు పైపాటుగా సూక్ష్మధాతువులు పిచికారీ చేసుకోవాలి.



- శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్

పశువుల పాక చుట్టూ పట్టాలు కట్టాలి

- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వినయ్‌కుమార్‌రెడ్డి సలహా



నల్లగొండ: చలి తీవ్రత పెరగడంతో పశువుల ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉంది. పశువుల పెంపకంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వినయ్‌కుమార్‌రెడ్డి సలహాలు..

- పశువుల శాలను శుభ్రంగా ఉంచాలి.
- సరైన వెలుతురు ఉండేలా ఏర్పాటు చేసి మురికి నీరు బయటకు పోయేలా చూడాలి.
- పశువుల పాక చుట్టూ పశువులకు రక్షణగా పట్టాలు కట్టాలి.
- పశువుల పాకలో వెచ్చదనం కోసం నేలపై ఎండు గడ్డి పరచాలి.
- వ్యాధి సోకిన పశువులను వేరే చోట ఉంచాలి.
- రాత్రి సమయంలో పశువుల కొట్టంలో ఉంచిన పశువులను ఉదయం ఆరుబయట కట్టేయాలి.
- గాలిలో తేమ వల్ల పశువులకు దాహం అనిపించకపోవడంతో శరీరంలో నీటిశాతం తగ్గుతుంది.
- దాణా, నీటిని తక్కువ తీసుకుంటాయి.
- మొక్కజొన్న లాంటి ధాన్యం గింజలతో పాటు తవుడును పెట్టాలి. పచ్చి మేతను తగిన మోతాదులో వేస్తే మంచిది.



- డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గంగిడి మనోహర్‌రెడ్డి

మునుగోడు: దేశంలో, రాష్ట్రంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గోలి లింగస్వామితో పాటు మరో 100 మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గంగిడి మనోహర్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని గతంలో పదేళ్లు పరిపాలించిన బీఆర్‌ఎస్ పార్టీ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందని, అదే బాటలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని, పైకి మాత్రమే విమర్శలు చేసుకుంటూ లోపాయకారిగా కలిసి ఉండి ఎవరి వ్యాపారాలు వారు కొనసాగించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గురించి తెలిసిన ప్రజలు ఏ రాష్ట్రంలో పోటీ చేసినా చిత్తుచిత్తుగా ఓడిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అందుకు నిదర్శనం రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల మంది సభ్యత్వాలు తీసుకోవడమేనని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వాల్లో నల్లగొండ జిల్లాలో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం మొదటి స్థానంలో, రాష్ట్రంలో 10వ స్థానంలో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 2లక్షల మంది పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి భవనం మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దర్శనం వేణుకుమార్, పగిళ్ల భిక్షం, బండారి యాదయ్య, అక్కెనపల్లి సతీష్, గాలయ్య, నరేందర్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

మహిళ మృతికి కారణమైన నిందితుడికి జీవిత ఖైదు

మిర్యాలగూడ టౌన్: పొలం వద్ద దారి విషయమై ట్రాక్టర్‌తో మహిళ ఢీకొట్టి ఆమె మృతికి కారణమైన నిందితుడికి జీవిత ఖైదీతో విధిస్తూ బుధవారం మిర్యాలగూడ 5వ అదనపు సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు తీర్పు వెలువరించారు. మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని జైత్రాంతండాకు చెందిన వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్‌ఎంపీ సైదులు పొలం వద్ద దారికి చదును చేసేందుకు ట్రాక్టర్, జేసీబీతో రాగా అదే గ్రామానికి చెందిన వీరమళ్ల లక్ష్మమ్మ మధ్య అడ్డుకుంది. ఈ క్రమంలో వీరమళ్ల సైదులు ట్రాక్టర్‌తో లక్ష్మమ్మను ఢీకొట్టడంతో కిందపడిపోయింది. ఆమెను ట్రాక్టర్‌తో తొక్కించడంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మమ్మ మనవడు సిరిమళ్ల వెంకటకృష్ణ లక్ష్మమ్మను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి మనవడు వెంకటకృష్ణ ఫిర్యాదు మేరకు వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్‌ఎంపీ సైదులు, వీరమళ్ల సైదులు అలియాస్ బద్రీ సైదులు, వీరమళ్ల సైదులు అలియాస్ బొర్ర సైదులు, మాలోతు కోటయ్య, వీరమళ్ల పెదలక్ష్మయ్య, వీరమళ్ల వెంకన్నపై అప్పటి మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సైదాబాబు కేసు నమోదు చేయగా.. అప్పటి సీఐ రమేష్‌బాబు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన మిర్యాలగూడ 5వ అదనపు సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్‌ఎంపీ సైదులుపై నేరం రుజువు కావడంతో అతడికి జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టకపోతే మరో ఆరునెలల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు. మిగిలిన వారిపై నేరం రుజువు కాలేదు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరమణారెడ్డి వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ ఆఫీసర్ చెరుపల్లి సైదులు సహకరించారు. ఏపీపీకి మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు పర్యవేక్షణలో సీఐ వీరబాబు, రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్, కోర్టు కానిస్టేబుల్ కిషన్ సహకరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


ప్రశాంత్ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): అనుమానాస్పద స్థితిలో మతిస్థిమితం లేని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన మొండికత్తి ప్రశాంత్ (29) తల్లి అతడి చిన్నతనంలోనే మృతిచెందింది. దీంతో ప్రశాంత్ తన చెల్లలితో కలిసి చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన తన బంధువు మొండికత్తి జానమ్మ వద్ద ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా ప్రశాంత్ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బుధవారం ఇంట్లోంచి గ్రామ శివారులో ఉన్నటువంటి స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల వైపు వెళ్లిన ప్రశాంత్ అక్కడ ఉన్న ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ పక్కన పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన ఒంటిపాక శ్రీకాంత్ చూసి కుటుంబ సభ్యులకు విషయం తెలుపగా.. మృతుడి తండ్రి శ్రీను వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు.

కల్మలచెరువు వాసి తిరుపతిలో మృతి


సైదులు మృతదేహం

గరిడేపల్లి: మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన తుమ్మకుమ్ము సైదులు(60) బుధవారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో మృతిచెందాడు. రెండు రోజుల క్రితం తిరుపతి వేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లిన సైదులు తిరుగు ప్రయాణంలో తిరుపతి రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కగా.. అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతిచెందాడు. సైదులు వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా తిరుపతి రైల్వే పోలీసులు గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబానికి పోలీసులు తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురాతన శిల్ప సంపదను కాపాడుకోవాలి

- ఫ్లీచ్ ఇండియా సీఈఓ శివనాగిరెడ్డి


ఏలేశ్వరం ఆలయంలో ఏర్పాటు చేసిన నంది విగ్రహాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్: పురాతన శిల్ప సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫ్లీచ్ ఇండియా సీఈఓ, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని పలు పురాతన ఆలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిల్ కాలనీలో బస్టాండ్‌కు వెళ్లే దారిలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ఏలేశ్వర మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో కాకతీయ కాలం నాటి శిలాఖండాలు నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏలేశ్వర స్వామి ఆలయం వెనుక 700 ఏళ్ల నాటి భిన్నమైన నంది ఆలయ ద్వార శాఖలు, విడి భాగాలు, రెండు సహస్ర లింగాలు ఉన్నాయని వాటిని ప్రాంగణంలో పీఠాలపై నిలబెట్టి లేబుల్ వేస్తే భక్తులు, పర్యాటకులకు వాటి చరిత్రను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 13వ శతాబ్దపు కళాఖండాలను భద్రపరిచి భావితరాలకు అందించాలని ఆలయ అధికారులు, కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు.

పోచంపల్లిని సందర్శించిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు


పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థుల బృందం

భూదాన్‌పోచంపల్లి: ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకునేందుకు బుధవారం హైదరాబాద్‌లోని యూఆర్‌ఎక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి చెందిన 20 మంది విద్యార్థినులు పోచంపల్లిని సందర్శించారు. చేనేత కార్మికుల గృహాలు, టూరిజం పార్కు, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను పరిశీలించారు. రంగులద్దకం, నూలు వడకడం, మగ్గాలు, చేనేత వస్త్రాలు, డిజైన్‌లను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి మార్కెటింగ్, ఉపాధి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ అర్విందర్, డైరెక్టర్ సోనిఊర్వశీ మాట్లాడుతూ.. స్టడీ టూర్‌లో భాగంగా ప్రతి సంవత్సరం పోచంపల్లికి వస్తుంటామని తెలిపారు. ఈ పర్యటన వల్ల ఎంతో కళాత్మకమైన, సంప్రదాయ చేనేత, దాని ప్రాశస్త్యాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఫ్యాషన్ వస్త్రాలను రూపొందించడానికి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో అనువుగా ఉన్నాయని కొనియాడారు. గ్రామీణ ప్రజల జీవన విధానాలు, సంస్కృతిని కూడా విద్యార్థినులకు పరిచయం చేయడమే కాకుండా వ్యాపార స్థాపనపై అవగాహన కల్పించామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ శివారులోని చింతపల్లి గ్రామ పరిధిలో పంట పొలాల్లో పేకాట ఆడుతున్న 11మందిని పక్కా సమాచారం మేరకు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపారు. మరో ముగ్గురు పరారైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.37,250 నగదు, 4 స్కూటీలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైస్ హిల్ డ్రాప్ సీడర్‌తో కూలీల సమస్య తగ్గుతుంది


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైస్ హిల్ డ్రాప్ సీడర్‌పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఇన్‌చార్జ్ నరేష్ మాట్లాడుతూ.. రైస్‌హిల్ డ్రాప్ సీడర్‌తో వరి విత్తనాలు వేయడం ద్వారా సాలుకు సాలుకు 25సెంటీమీటర్ల దూరంలో సన్న రకం పది గింజలు, దొడ్డు రకం సుమారు ఐదు నుంచి ఆరు గింజలు ఒకే ప్రదేశంలో పడతాయన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, డి. ఆదర్శ్, మాధురి, నరేష్, కేవీకే సిబ్బంది, డైరెక్టర్ పుండరీకాక్షుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దుచేయాలి


సమావేశంలో కమిటీ సభ్యులు, నాయకులు

మోతె: మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఎస్ఎంకే ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసేంత వరకు ఐక్యంగా పోరాడాలని ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం మండలంలోని సర్వారం గ్రామంలో కమిటీ సభ్యులతోపాటు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. రావిపహాడ్ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే మోతెతోపాటు ఆత్మకూర్ (ఎస్) మండలాల్లోని పది గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇథనాల్ కంపెనీ నుంచి వ్యర్థ జలాలను పక్కనే ఉన్న పాలేరు రిజర్వాయర్‌లోకి వదిలితే చుట్టుపక్కల ఉన్న భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయన్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, రైతాంగ సమితి జిల్లా నాయకుడు నల్లెడ మాధవరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు, సర్వారం గ్రామ నాయకులు వెంకటేశ్వరరావు, మేకల గురుకృష్ణ, ఉప్పుల మధుయాదవ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, పల్స మల్సూర్, వీరబోయిన లింగంయాదవ్, బాలాజీనాయక్, నల్లాల శ్రీను, ఉప్పుల సందీప్, మేకల రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల సాగు.. లాభాలు బాగు

- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- తక్కువ సమయంలో పంట చేతికి
- నీటి వినియోగం కూడా తక్కువే


పెద్దవూరలో సాగవుతున్న పాలకూర

పాడి పంట

పెద్దవూర: ఆరుతడి పద్ధతిలో ఆకుకూరల సాగు చేపట్టడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఆకు కూరల సాగులో మెళకువలపై సలహాలు సూచనలు ఆయన మాటల్లోనే..

సాగు చేయాల్సిన ఆకుకూరలు ఇవే..

తోటకూరలో ఏఆర్ఎస్‌పి రకం మంచి దిగుబడి వస్తుంది. విత్తిన 15-20 రోజులకే మొదటి కోత వస్తుంది. పూసాలాల్ చౌలై రకం ఆకుల పైభాగం ముదురు ఎరుపు రంగులోనూ, అడుగు భాగం నీలి ఎరుపు రంగులో ఉంటుంది. విత్తిన 24-30 రోజుల్లో మొదటి కోతకు వస్తుంది. వీటితోపాటు ఆర్క అరుణ, కో-1,2,3 రకాలను సాగు చేయవచ్చు. పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం మేలైనది. ఇది విత్తిన 15-20 రోజుల్లోనే కోతకు వస్తుంది. 6 నుంచి 7 కోతల్లో ఎకరాకు 50 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది. ఆర్క అనుపమ కూడా సాగు చేయవచ్చు. మెంతికూరలో లాంసెలక్షన్-1 రకం గుబురుగా పెరుగుతుంది. ఎక్కువ ఆకు దిగుబడి ఇస్తుంది. పూసాఎర్లీ బించింగ్ రకం కూడా తొందరగా కోతకు వస్తుంది. హిస్సార్ సువర్ణ రకం కూడా పూసాఎర్లీ బంచింగ్ కంటే 20 శాతం అధిక దిగుబడి వస్తుంది. గోంగూరలో ఏఎన్‌జీఆర్‌యూ-1 రకం ఎకరాకు 4-5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎంఎస్-3 రకం కూడా ఎర్ర గోంగూర రకానికి చెందినదే. కొత్తిమీరలో స్వాతి(సీఎస్-6) పంట కాలం 80-85 రోజులు ఉంటుంది. సాధన (సీఎస్-4) రకం పంటకాలం 100-110 రోజులు ఉంటుంది. ఇది పేనుబంకను తట్టుకుంటుంది. బచ్చలిలో ఎర్ర బచ్చలి, పుదీనాలో స్పియర్‌మింట్ వంటి రకాలు సాగుకు అనుకూలం.

విత్తే పద్ధతి..

పాలకూర సాగుకు వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10సెం.మీ. ఉండాలి. గోంగూరకు వరుసల మధ్య దూరం 30సెం.మీ, మొక్కల మధ్య దూరం 10 సెం.మీ, తోటకూరలో వరుసల మధ్య దూరం 20 సెం.మీ., మెంతికూరలో వరుసల మధ్య దూరం 25 సెం.మీ, మొక్కల మధ్య దూరం 10 సెంటీమీటర్లు, బచ్చలికూరలో వరుసల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య దూరం 60 సెం.మీ ఉండాలి.

దిగుబడి పెంచడానికి మార్గాలు

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను ఉపయోగించి విత్తన శుద్ధి చేయాలి. విత్తిన 20 రోజుల తర్వాత 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుమార్లు కలుపు తీసి మట్టిని కదిలించాలి. విత్తే ముందు ఫ్లక్లోరిలిన్ కలుపు మందును ఎకరాకు 800 గ్రాములు వాడాలి. సేంద్రియ ఎరువులను వాడితే నేలలో తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచి సూక్ష్మజీవుల చర్యలు అధికమై పోషకాల లభ్యత పెరుగుతుంది. విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మూడో రోజు కూడా నీరు పెట్టాల్సి ఉంటుంది. భూమిలో తేమను బట్టి 5-7 రోజులకు తడి ఇవ్వాలి. విత్తిన మొదటిసారి నీరు పెట్టేటప్పుడు నెమ్మదిగా నీరు పెట్టాలి. నీటి వేగం ఎక్కువైతే విత్తనాలన్నీ కొట్టుకుపోయి మొలక శాతం తగ్గుతుంది. నీటి ఎద్దడి తట్టుకోవడానికి లీటరు నీటికి 20 గ్రాములు కలిపి చల్లాలి. తోటకూర సాగుకు 800 గ్రాములు, పాలకూరకు 10-12 కిలోలు, గోంగూరకు 6 కిలోలు, మెంతికూరకు 8-10 కిలోలు, కొత్తిమీరకు 4.5 కిలోలు, బచ్చలికూర సాగుకు 5-6 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు


గోదాదేవికి పూజలు చేస్తున్న పారాయణీకులు, అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు బుధవారం గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కట్టెపొంగలిని ఆరగింపుగా పెట్టారు. మహిళలు మంగళ హారతులు సమర్పించారు.

ప్రభుత్వ భూమి బోర్డు తొలగించిన వారిపై కేసు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డలో గల మల్లెతోటను ఇటీవల సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు గుర్తించారు. దీంతో అక్కడ అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేసి ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డులను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని తహసీల్దార్ హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సుధీర్‌కుమార్ బుధవారం తెలిపారు.

పంటకు రక్షణగా హీరోయిన్ల ఫ్లెక్సీలు

పంట చేలు బాగుంటే చూపరుల దిష్టి తగులుతుందని రైతులు తమ పొలాల్లో దిష్టిబొమ్మలు, రాక్షసుల బొమ్మలు ఏర్పాటు చేస్తుంటారు. కానీ నల్లగొండ పట్టణ సమీపంలోని వివిధ ప్రాంతాల్లో పలువురు రైతులు తమ తమ పొలాల్లో హీరోయిన్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. - నల్లగొండ రూరల్


